www.prajasakti.com

ప్రజాశక్తి

శుక్రవారం 25 నవంబరు 2022

5

ఏలూరు



జిల్లాలో 41,741 మెట్రిక్ టన్నుల ధాన్యం సేకరణ : జెసి

ఏలూరు: జిల్లాలో ఖరీఫ్ పంట 2022-23 సంవత్సరానికి సంబంధించి ఇప్పటివరకూ 175 రైతు భరోసా కేంద్రాల ద్వారా 41,741 మెట్రిక్ టన్నుల ధాన్యం 5976 మంది రైతుల నుండి కొనుగోలు చేశామని జెసి పి.అరుణ్‌బాబు ఒక ప్రకటనలో తెలిపారు. రూ.12.19 కోట్ల నగదు 1019 మంది రైతుల బ్యాంకు ఖతాల్లో జమ చేశామన్నారు. ధాన్యం కొనుగోలు ప్రక్రియలో యాప్‌లో కొన్ని సాంకేతిక లోపాలను అధిగమించి యాప్ ద్వారా ధాన్యం కొనుగోలు సజావుగా జరుగుతుందని, రైతులు ధాన్యాన్ని ఆర్‌బికెల వద్ద అమ్ముకోవాలని సూచించారు.

ఉంగుటూరు : మండలంలోని ధాన్యం అమ్మిన రైతులకు తొమ్మిది రోజుల్లోగా రూ.14 లక్షలు వారి బ్యాంకు ఖాతాల్లో జమ చేశామని తహాశీల్దార్ ఎవి.రమణారావు తెలిపారు. బొమ్మిడి, వెల్లమిల్లి, ఉంగుటూరు గ్రామాలకు చెందిన 12 మంది రైతులకు ధాన్యం అందించిన ఏడు నుండి తొమ్మిది రోజుల్లో రికార్డు సమయంలో సొమ్మును ప్రభుత్వం వారి ఖాతాలకు జమచేసిందన్నారు.

వేడెక్కుతున్న రాజకీయం..!

అధినేతల పర్యటనలతో జిల్లాలో ఎన్నికల కాక


సిఎం పర్యటనకు పోటీగా చంద్రబాబు టూర్

త్వరలోనే జనసేన అధ్యక్షుడు పవన్ పర్యటించే అవకాశం

ఇప్పటి నుంచే కేడర్‌ను ఎన్నికలకు సిద్ధం చేస్తున్న అధినేతలు

ప్రతిపక్షాలకు ఆయుధంగా ధాన్యం కొనుగోళ్లు, ఆక్వా ధర







ప్రజాశక్తి - ఏలూరు ప్రతినిధి

ఏడాదిన్నరకు ముందే జిల్లాలో ఎన్నికల వాతావరణం నెలకొంది. ప్రధాన పార్టీల అధినేతల జిల్లా పర్యటనలతో జిల్లా రాజకీయం రోజురోజుకీ వేడెక్కుతోంది. పార్టీ కేడర్‌లో కొత్త జోష్ నింపి ఎన్నికలకు సమాయత్తం చేసేందుకు ఇప్పటి నుంచే అధినేతలు చర్యలు చేపట్టారు. అందులో భాగంగానే పార్టీ అధినేతలు జిల్లాలకు వస్తున్నారు. ఇప్పటికే సిఎం జగన్ జిల్లా పర్యటన పూర్తవగా ఈ నెల 30వ తేదీ నుంచి మూడు రోజులపాటు చంద్రబాబు జిల్లా పర్యటన ఖరారైంది. త్వరలోనే జనసేన అధ్యక్షుడు పవన్‌కల్యాణ్ సైతం జిల్లాలో పర్యటించనున్నట్లు తెలుస్తోంది. అధినేతల పర్యటనలతో ఆయా పార్టీల కేడర్‌లో జోష్ కన్పిస్తోంది. నేతల పర్యటనలను విజయవంతం చేసేందుకు తీవ్రంగా కష్టపడుతున్నారు. ఈ నెల 21న సిఎం జగన్ నరసాపురంలో పర్యటించారు. ఈ పర్యటనలో రూ.మూడు వేల కోట్లకుపైగా విలువ చేసే పనులకు సంబంధించి శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు చేశారు. ఈ సందర్భంగా టిడిపి, జనసేనలపై తీవ్ర విమర్శలు గుప్పించిన సంగతి తెలిసిందే. ఇదేం ఖర్మరా బాబు అంటూ చంద్రబాబును ఎద్దేవా చేస్తూ సిఎం విమర్శలు చేశారు. జనసేనను రౌడీసేన అంటూ ఘాటైన విమర్శలు గుప్పించారు. వైసిపి కేడర్‌లో జోష్ నింపేలా ప్రతిపక్షాలపై తీవ్ర విమర్శలు చేస్తూ జగన్ తన పర్యటన సాగించారు. సిఎం విమర్శలను తిప్పికొడుతూ అదే నినాదంతో 'రాష్ట్రానికి ఇదేం ఖర్మ' అంటూ కార్యక్రమాన్ని టిడిపి తలపెట్టింది. ఈ కార్యక్రమాన్ని జిల్లా నుంచే ప్రారంభించేందుకు ఈ నెల 30వ తేదీ నుంచి మూడు రోజులపాటు ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లాలో చంద్రబాబు పర్యటన షెడ్యూల్ ఖరారైంది. చింతలపూడి, పోలవరం, కొవ్వూరు, నిడదవోలు, తాడేపల్లిగూడెం నియోజకవర్గాల్లో ఈ పర్యటన సాగనుంది. రోడ్‌షో, బహిరంగ సభలతో చంద్రబాబు పర్యటన సాగనుంది. టిడిపి కేడర్‌లో జోష్ నింపి ఎన్నికలకు సమాయత్తం చేసేలా చంద్రబాబు పర్యటనను ఏర్పాటు చేశారు. చంద్రబాబు పర్యటనను విజయవంతం చేసేందుకు తెలుగు తమ్ముళ్లు తీవ్రంగా కష్టపడుతున్నారు. ఆయా నియోజకవర్గాల్లో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలపై హామీలు గుప్పించేలా కసరత్తు చేస్తున్నారు. చంద్రబాబు పర్యటన ముగిసిన తర్వాత పవన్ కల్యాణ్ పర్యటన సాగే అవకాశాలు కన్పిస్తున్నాయి.

గెలుపోటములను నిర్ధేశించేది ఇక్కడ సీట్లే

రాష్ట్రంలో ఏపార్టీ అధికారంలోకి రావాలన్నా జిల్లాలోని అసెంబ్లీ స్థానాలు కీలకంగా మారుతున్నాయి. 2014 ఎన్నికల్లో ఉమ్మడి జిల్లావ్యాప్తంగా 15 అసెంబ్లీ స్థానాలను టిడిపి కైవసం చేసుకుంది. ఏ జిల్లాలోనూ ఈ విధంగా సీట్లు రాలేదు. మిగిలిన ప్రాంతాల్లో టిడిపికి సీట్లు తగ్గినప్పటికీ గోదావరి జిల్లాల్లో వచ్చిన సీట్లతోనే టిడిపి అధికారం చేపట్టింది. 2019 ఎన్నికల్లో జిల్లాలోని 15 స్థానాల్లో 13 స్థానాలు వైసిపి గెలుచుకుని అధికారం చేపట్టింది. ఎన్నికల్లో ఏ పార్టీనైనా ఇక్కడి ప్రజలు ఏకపక్షంగా గెలిపిస్తున్నారు. దీంతో జిల్లాపై ప్రధాన పార్టీలు కేంద్రీకరిస్తున్నాయి. 2024 ఎన్నికల్లోనూ జిల్లాలో అత్యధిక స్థానాలు గెలుచుకోవాలని టిడిపి, వైసిపి తమ వ్యూహాలు రచిస్తున్నాయి. దీంతో అధినాయకులు జిల్లాపై ప్రధానంగా దృష్టి సారించారనే చర్చ సాగుతోంది.

రైతుల సమస్యలే ప్రధాన ఆయుధం

జిల్లాలో 80 శాతం ప్రజానీకం వ్యవసాయంపైనే ఆధారపడి జీవిస్తున్నారు. ప్రధాన పంటలుగా వరి, ఆక్వా ఉన్నాయి. ధాన్యం కొనుగోలుకు సంబంధించి ప్రభుత్వం తెచ్చిన నూతన విధానం రైతులను తీవ్ర ఇబ్బందులకు గురిచేస్తోంది. దీంతో రైతులు రోడ్డెక్కి ఆందోళనలు చేస్తున్నారు. ధాన్యం కొనుగోలు చేయకపోవడంతో కళ్లాల్లోనే ధాన్యం ఉండిపోయింది. వర్షాలు వెంటాడుతుండటంతో రైతులు తీవ్ర ఆందోళనకు గురవుతున్నారు. ఆక్వాకు సైతం సరైన ధరలేక రైతులు తీవ్రంగా నష్టపోతున్నారు. దీనిపై ఇటీవల రైతులనుంచి తీవ్ర వ్యతిరేకత వ్యక్తమవుతోంది. రైతుల సమస్యలను ప్రధాన ఆయుధంగా చేసుకుని ప్రభుత్వాన్ని ప్రజల్లో దోషిగా నిలబెట్టేలా ప్రతిపక్ష పార్టీలు ముందుకు సాగుతున్నాయి. ధాన్యం కొనుగోలు, ఆక్వా రంగంలో సమస్యలు ప్రభుత్వాన్ని కుదిపేస్తున్నాయి.

ధాన్యం కొనుగోలు వేగవంతం చేయాలి : సిపిఎం

ప్రజాశక్తి - ఏలూరు

ధాన్యం కొనుగోలులో రాష్ట్ర ప్రభుత్వం తెచ్చిన కొత్త విధానంలో మార్పులు చేసి, రైతాంగం నుండి కల్లాల్లోని ధాన్యం వెంటనే కొనుగోలు చేయాలని సిపిఎం ఏలూరు జిల్లా కార్యదర్శి ఎ.రవి డిమాండ్ చేశారు. స్థానిక పవర్‌పేటలోని సిపిఎం జిల్లా కార్యాలయంలో గురువారం జిల్లా కమిటీ సమావేశం నిర్వహించారు. తెల్లం రామకృష్ణ అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో రవి మాట్లాడుతూ ధాన్యం సేకరణలో రాష్ట్ర ప్రభుత్వం తీసుకొచ్చిన నూతన విధానం వల్ల అన్నదాతలు ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. కొనుగోలు ప్రక్రియ వేగవంతం కాకపోవడంతో కల్లాలోనే ధాన్యం ఉండిపోయిందన్నారు. రవాణా, హమాలీల ఏర్పాటు రైతులే చూసుకోవాలని రాష్ట్ర ప్రభుత్వం చెప్పడంతో చేతిలో చిల్లిగవ్వలేని రైతులు ఆర్థికంగా అల్లాడుతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. కొనుగోలు కేంద్రాల ద్వారా రవాణా, హమాలీల ఏర్పాట్లు ప్రభుత్వమే చూడాలని కోరారు. ధాన్యం తూకం వేసిన తర్వాత ఏ మిల్లుకు తీసుకువెళ్లాలనే విషయాన్ని ఆలస్యంగా చెప్పడంతో లారీలు, ట్రాక్టర్ల యజమానులు ధాన్యం రవాణాకు ముందుకు రావడం లేదని చెప్పారు. ఎకరాకు 34 బస్తాలకు మించి ధాన్యం కొనుగోలు చేయబోమని పరిమితి పెట్టడం వల్ల 34 బస్తాలకు మించి దిగుబడి వచ్చిందని, మిగిలిన ధాన్యాన్ని రైతులు ఏమి చేసుకోవాలని వారు ప్రశ్నించారు. కొనుగోలు పరిమితి 40 బస్తాలకు పెంచాలని డిమాండ్ చేశారు. సరిపడు గోనె సంచులు అందించాలని కోరారు. తేమశాతం నిబంధన సడలించి కొనుగోలు చేయాలని కోరారు. ఈ సమావేశంలో నాయకులు ప్రసాద్, ఆర్.లింగరాజు, తెల్లం రామకృష్ణ, ఎం.నాగమణి, జి.రాజు మాట్లాడారు.

నిబంధనలు సడలించాలి



కల్లాల్లో ధాన్యం పరిశీలిస్తున్న రైతు సంఘం నేతలు

ప్రజాశక్తి - భీమడోలు

వాతావరణ మార్పుల నేపథ్యంలో ధాన్యం కొనుగోలులో తేమశాతం నిబంధనలు సడలించాలని, రైతుల అవసరాల మేరకు పూర్తిస్థాయిలో గోనెసంచులు అందజేయాలని ఎపి రైతు సంఘం జిల్లా కార్యదర్శి కె.శ్రీనివాస్, సహాయ కార్యదర్శి కట్టా భాస్కరరావు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా రైతు సంఘం బృందం గురువారం మండలంలో పర్యటించింది. వాతావరణ మార్పుల కారణంగా రోడ్లపైన, ఖాళీ స్థలాల్లో ధాన్యాన్ని ఆరబెడుతున్న రైతులను వారు కలిశారు. వారి ఇబ్బందులను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా కొందరు రైతులు ధాన్యం రవాణా విషయమై ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని బృందం దష్టికి తెచ్చారు. సుదూర ప్రాంతాల్లోని మిల్లులకు కాక తమకు సమీపంలోని మిల్లుల్లో ధాన్యం అమ్ముకునేందుకు అవకాశం ఇవ్వాలని, అక్కడికి ధాన్యాన్ని ఎడ్లబండ్లపై తరలించేందుకు అనుమతించాలని కోరారు. దీనివల్ల ధాన్యం రవాణాకు ట్రాక్టర్లు, లారీల కోసం రోజుల తరబడి రైతులు ఎదురు చూడాల్సిన అవసరం ఉండదని సూచించారు. ఈ మేరకు రైతులకు రవాణాఛార్జీలు, ఎగుమతి, దిగుమతి ఛార్జీలు చెల్లించాలని రైతులు కోరారు.

ఈ సందర్భంగా శ్రీనివాస్ మాట్లాడుతూ ఎకరాకు 34 బస్తాలు మాత్రమే కొనుగోలు చేస్తున్నారని, దీనివల్ల ఎక్కువ దిగుబడి వచ్చిన రైతులు ఇబ్బందులు పడతారన్నారు. దీనివల్ల దళారులకు ధాన్యం అమ్మి నష్టపోతారన్నారు. వాతావరణ మార్పుల నేపథ్యంలో తేమశాతంతో నిమిత్తం లేకుండా ధాన్యం కొనుగోలు చేయాలని కోరారు. కొంతమంది రైతులు ధాన్యాన్ని ఆరబెట్టి 17శాతం తేమతో సరఫరా చేసినప్పటికీ దాన్ని మరింతగా ఆరబెట్టి తీసుకురావాలని వెనక్కి పంపుతున్నారని తెలిపారు. దీనివల్ల రైతులు ఇబ్బంది పడుతున్నారన్నారు.

నేడు గుండుగొలను వంతెన ప్రారంభం

ప్రజాశక్తి - భీమడోలు

ఏలూరు కాలువపై గుండుగొలను వద్ద నూతనంగా నిర్మించిన బెయిలీ వంతెనను ఈ నెల 25న ప్రారంభిస్తున్నట్లు పంచాయతీ ఉప సర్పంచి, వైసిపి నాయకులు ముదుండి సూర్యనారాయణరాజు తెలిపారు. ఉంగుటూరు, దెందులూరు ఎంఎల్‌ఎలు పుప్పాల వాసుబాబు, కొఠారు అబ్బయ్యచౌదరితో పాటు కలెక్టర్ ప్రసన్న వెంకటేష్, ఎంపీ కోటగిరి శ్రీధర్ ప్రారంభోత్సవానికి హాజరుకానున్నారని తెలిపారు. వంతెన ముగింపు పనులను ఉపసర్పంచి గురువారం పర్యవేక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ ఏడాది సెప్టెంబర్‌లో వంతెన కూలిన వెంటనే స్పందించిన ఉంగుటూరు ఎంఎల్‌ఎ పుప్పాల వాసుబాబు పెనుగొండ ప్రాంతంలోని బెయిలీ వంతెనను గుండుగొలను తీసుకువచ్చి పున:నిర్మాణానికి అవసరమైన రూ.46.70 లక్షల మంజూరుకు కృషి చేశారన్నారు. పనుల వేగవంతానికి సహాయ సహకారాలు అందజేశారని తెలిపారు. వంతెన నిర్మాణ కార్యక్రమాలను యుద్ధప్రాతిపదికన పూర్తి చేసేందుకు ఎపి రోడ్లు అభివృద్ధి కమిషన్ ఛైర్మన్ కె.సుబ్బరాజు తన వంతు సహకారాన్ని అందజేశారన్నారు. 73 రోజుల్లో ఈ బెయిలీ వంతెన నిర్మాణం పూర్తయిందన్నారు.

ఆంధ్రాబ్యాంకు వ్యవస్థాపకులు భోగరాజు స్వగ్రామంలో

అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టాలి



పట్టాభి విగ్రహానికి నివాళులర్పిస్తున్న ప్రతినిధులు

భీమడోలు: స్వాతంత్ర్య సమరయోధులు, ఆంధ్రాబ్యాంక్ వ్యవస్థాపకులు డాక్టర్ భోగరాజు పట్టాభి సీతారామయ్య జన్మస్థలం గుండుగొలనులో పలు అభివృద్ధి కార్యక్రమాలు చేపడతామని అప్పటి ఆంధ్రాబ్యాంక్ యాజమాన్యం ఇచ్చిన హామీలను బ్యాంకును విలీనం చేసుకున్న యూనియన్ బ్యాంక్ అమలు చేయాలని గుండుగొలను పట్టాభి సీతారామయ్య అభ్యుదయ సంఘం అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు మామిడిపల్లి కాశీహనుమాన్ బాబు, బొల్లిన కోటేశ్వరరావు కోరారు. సంఘం ఆధ్వర్యంలో సీతారామయ్య 142వ జయంతిని గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా గుండుగొలను సొసైటీ అధ్యక్షులు వివివి.భాస్కర్‌తో పాటు పలువురు ప్రముఖులు ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. పలువురు వక్తలు ఆయన సేవలను కొనియాడారు.



వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న నాయకులు

వ్య.కా.స రాష్ట్ర మహాసభ విజయవంతానికి సహకరించాలి

ప్రజాశక్తి - జంగారెడ్డిగూడెం

వచ్చే నెల 8, 9, 10 తేదీల్లో జంగారెడ్డిగూడెంలో జరగనున్న ఎపి వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర 29వ మహాసభను జయప్రదం చేయాలని మహాసభ ఆహ్వాన సంఘం ఉపాధ్యక్షులు డాక్టర్ దండమూడి ప్రసాద్, ప్రముఖ న్యాయవాది మేకా ఈశ్వరయ్య కోరారు. ఈ మేరకు గురువారం స్థానిక ఆహ్వాన సంఘ కార్యాలయంలో మహాసభ సందర్భంగా బహిరంగసభ ప్రదర్శన, బహిరంగసభ వాల్‌పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ బహిరంగసభలో జాతీయనేత బృందాకరత్ హాజరుకావడం హర్షణీయమన్నారు. మహాసభల నిర్వహణకు పట్టణ, పరిసర ప్రాంతాల పెద్దలు, ప్రజలు సహకరించాలని విజ్ఞప్తి చేశారు. రానున్న కాలంలో వ్యవసాయ రంగం, రాష్ట్ర అభివృద్ధికి దిశా దశ నిర్దేశం చేసే విధంగా మహాసభ జరగాలని ఆకాంక్షించారు. శ్రమజీవులంతా పాల్గొని జయప్రదం చేయాలని వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు వి.శివనాగరాణి, ఎ.రవి కోరారు. ఈ కార్యక్రమంలో ప్రజాసంఘాల నాయకులు, తెల్లం రామకృష్ణ, ఎం.జీవరత్నం, పి.రామకృష్ణ, ఎం.నాగమణి, ఎ.శ్యామలారాణి, ఎస్‌కె.సుభాషిణి, పి.సూర్యారావు, తామా ముత్యాలమ్మ, జి.సూర్యకిరణ్, ఎ.ప్రభాకర్‌రావు పాల్గొన్నారు.

అంగన్‌వాడీ కేంద్రాల్లో ఐసిడిఎస్ పీడీ తనిఖీలు



స్టాకును పరిశీలిస్తున్న పీడీ పద్మావతి

ప్రజాశక్తి - ఉంగుటూరు

అంగన్‌వాడీ కేంద్రాల్లో ప్రీస్కూల్ నిర్వహణపై కార్యకర్తలు ప్రత్యేక దృష్టి సారించాలని ఐసిడిఎస్ పీడీ పద్మావతి అన్నారు. గురువారం ఆమె మండలంలోని తల్లాపురం, కైకరం, అక్కుపల్లిగోకవరంలోని అంగన్‌వాడీ కేంద్రాలను తనిఖీ చేశారు. ఆయా సెంటర్లలో వైఎస్ఆర్ సంపూర్ణ పోషణ్, పోషణ ట్రాకర్ యాప్‌లో నమోదు చేసిన చిన్నారుల హాజరు తదితర అంశాలపై క్షేత్రస్థాయిలో పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. పిపి-1, పిపి-2, ప్రీ స్కూల్ యాక్టివిటీస్‌పై కార్యకర్తలు మరింత దృష్టిసారించాలని ఆదేశించారు. గర్భిణుల, బాలింతల, చిన్నారుల సంక్షేమాన్ని సమీక్షించారు. పిల్లల ఎత్తుకు తగ్గ బరువులను, పౌష్టికాహారం స్టాకులను పరిశీలించారు. తల్లాపురంలో ఎత్తుకు తగ్గ బరువు లేనివారు ఇద్దరు, వయస్సుకు తగ్గ ఎత్తు లేని వారు నలుగురు ఉన్నట్లు గుర్తించారు. అక్కుపల్లి గోకవరంలో నాడు - నేడు పథకంలో రూ.35 లక్షలతో చేపట్టిన అంగన్‌వాడీ కేంద్రం నిర్మాణాన్ని పీడీ పరిశీలించారు. చేబ్రోలు, ఉంగుటూరు సెక్టార్ల పర్యవేక్షకులు రూప, భాగ్యలక్ష్మి, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

ఏలూరులో పచ్చదనం మెరుగుకు చర్యలు : కలెక్టర్

ప్రజాశక్తి - ఏలూరు

ఏలురు నగరంలో మరింత పచ్చదనం మెరుగుదలకు, కాలుష్య నివారణకు చర్యలు చేపడుతున్నట్లు కలెక్టర్ ప్రసన్న వెంకటేష్ తెలిపారు. గురువారం సాయంత్రం ఏలూరు నగరం సత్రంపాడు పెద్దచెరువు అభివృద్ధిలో భాగంగా నగర వనంగా తీర్చిదిద్దడానికి తీసుకోవాల్సిన చర్యలపై కలెక్టర్, టెరిటోరియల్ డివిజన్ డిఎఫ్‌ఒ రవీంద్రనాద్ ధామ, మున్సిపల్ కమిషనరు షేక్ షాహిద్, ఏలూరు ఆర్‌డిఒ కె.పెంచల కిషోర్‌తో కలిసి పెద్దచెరువును పరిశీలించి నగర వనంగా అభివృద్ధికి అవసరమైన చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నగరంలో గ్రీనరీ పెంపొందించే దిశగా నగర వనం ఏర్పాటుకు ప్రత్యేక కార్యాచరణ రూపొందిస్తున్నామన్నారు. పచ్చని నగరంగా ఏలూరును నిలిపేందుకు సంబంధిత అధికారులందరూ సమన్వయంతో పనిచేయాలన్నారు. ఈ కార్యక్రమంలో మండల సర్వేయరు పి.విశ్వనాథం, సచివాలయ సిబ్బంది, మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.

అధికారులు లక్ష్యాలు పూర్తిచేయాలి : కలెక్టర్

ప్రజాశక్తి - ఏలూరు

రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న వివిధ సంక్షేమ, అభివృద్ధి పనుల ప్రగతి తీరుపై రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సమీర్ శర్మతోపాటు సిసిఎల్ఎ కమిషనర్ సాయి ప్రసాద్, పలు శాఖల కార్యదర్శులు, ఉన్నతాధికారులు గురువారం అన్ని జిల్లాల కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షించారు. ఈ సందర్భంగా సమీర్ శర్మ జిల్లాలో ప్రభుత్వ భవనాల నిర్మాణాలు, విద్యా, వైద్యం, పారిశుద్యం, తాగునీరు తదితర అంశాలపై సమీక్షించారు. అనంతరం రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి కమిషనర్ కోన శశిధర్ జిల్లా కలెక్టర్లతో నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో స్వమిత్వ, స్వచ్ఛ సంకల్పం, ఉపాధిహామీ, జలజీవన్ మిషన్ తదితర అంశాలపై సమీక్షించారు. ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో ఏలూరు కలెక్టరేట్ నుంచి కలెక్టర్ ప్రసన్న వెంకటేష్ పాల్గొన్నారు. సమావేశం అనంతరం కలెక్టర్ ప్రసన్నవెంకటేష్ సంబధిత జిల్లా అధికారులతో సమీక్షించి పలు సూచనలు చేశారు. ప్రభుత్వ ప్రాధాన్యత భవన నిర్మాణాలైన రైతు భరోసా కేంద్రాలు, గ్రామ సచివాలయాలు, విలేజ్ హెల్త్ క్లీనిక్స్, డిజిటల్ లైబ్రరీ నిర్మాణాలను స్టేజి వారీగా పురోగతి ఉండేలా లక్ష్యాలు నిర్దేశించుకుని వేగంగా పూర్తిచేయాలన్నారు. చెత్తనుండి సంపద కేంద్రాల షెడ్ల నిర్మాణాలను పూర్తిచేయాలని ఆదేశించారు. ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో జెసి పి.అరుణ్ బాబు, జెడ్‌పి సిఇఒ కె.రవికుమార్, ఆర్‌డబ్ల్యుఎస్ ఎస్‌ఇ ఎన్‌వివి సత్య నారాయణ, డ్వామా పీడీ డి.రాంబాబు, పంచాయతీరాజ్ ఇన్‌ఛార్జి ఎస్ఇ ఎంవి రమణమూర్తి పాల్గొన్నారు.

ఆ విద్యాసంస్థలపై చర్యలు తీసుకోండి

ప్రజాశక్తి - ఏలూరు

నిబంధనలు పాటించని ప్రయివేటు విద్యాసంస్థల యాజమాన్యాలపై చర్యలు తీసుకోవాలని అఖిల భారత రవాణా వర్కర్ల ఫెడరేషన్ డిమాండ్ చేసింది. జిల్లాలో దాదాపు వెయ్యికిపైగా ప్రయివేటు స్కూలు, కాలేజీల బస్సులు విద్యార్థులను చేరవేస్తున్నాయని, సరైన ఫిట్‌నెస్ లేకపోవడంతో తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయని అఖిల భారత రవాణా వర్కర్ల ఫెడరేషన్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు బుద్దా నాగసూరిబాబు, జె.గోపి అన్నారు. ఈ మేరకు వారు ఏలూరు ఆర్‌డిఒ కె.శ్రీహరికి వినతిని అందించారు. ఈ సందర్భంగా నాగసూరిబాబు మాట్లాడుతూ భావిభారత పౌరులుగా తయారయ్యే విద్యార్థుల భవిష్యత్ పట్ల, విద్యార్థులను చేరవేసే బస్సు డ్రైవర్ల పట్ల ఆయా యాజమాన్యాలు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. లాభాలే పరమావధిగా భావించి ప్రయివేట్ స్కూలు, కాలేజీల యాజమాన్యాలు 60 సంవత్సరాలు దాటిన రిటైర్డ్ డ్రైవర్లను తక్కువ జీతాలకు స్కూలు, కాలేజీ బస్సులకు నియమించుకుంటూ నిబంధనలు తుంగలో తొక్కుతున్నారన్నారు. నిబంధనలు పాటించని యాజమాన్యాలపై కఠిన చర్యలు తీసుకోవాలని లేని పక్షంలో తమ ఫెడరేషన్ తరపున ఆందోళన చేపడతామని తెలిపారు.

26న క్విజ్, పోస్టర్ ప్రజెంటేషన్ పోటీలు

ప్రజాశక్తి - ఏలూరు టౌన్

భారతీయ విద్యా మండలి, ఎపి కౌన్సిల్ ఆఫ్ సైన్స్ అండ్ టెక్నాలజీ నిర్వహిస్తున్న ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు క్విజ్, పోస్టర్ ప్రజెంటేషన్ పోటీలను జిల్లాస్థాయిలో ఈనెల 26న స్థానిక ఈదర సుబ్బమ్మ దేవి నగర బాలికోన్నత పాఠశాలలో నిర్వహిస్తున్నట్లు డిఇఒ ఆర్‌ఎస్.గంగాభవాని తెలిపారు. జిల్లాస్థాయిలో ఎంపికైన 36 పాఠశాల జట్లు పోస్టర్ ప్రజెంటేషన్‌కు సంబంధించి సాధారణ, స్వతంత్రతాకా అమృత్ ఉత్సవ్ అంశాల్లో ఎంపికైన విద్యార్థులు ఉదయం 9.30 గంటలకు కస్తూరిబా పాఠశాలకు రావాలన్నారు. క్విజ్ పోటీల విజేతలకు ప్రథమ బహుమతి రూ.7500, ద్వితీయ బహుమతి రూ.6000, తృతీయ బహుమతి రూ.4500 నగదు బహుమతిగా అందిస్తామని తెలిపారు. పోస్టర్ ప్రజెంటేషన్ మొదటి బహుమతి రూ.3000, రెండో బహుమతి రూ.2000, మూడో బహుమతి రూ.వెయ్యి అందిస్తామని పేర్కొన్నారు. ఇతర వివరాలకు 8142035942 నెంబర్‌ను సంప్రదించాలని సూచించారు.

అంగన్‌వాడీల రవాణా ఇబ్బందులు తొలగించాలని వినతి



ఐసిడిఎస్ పీడీకి వినతిని అందిస్తున్న అంగన్‌వాడీలు

ప్రజాశక్తి - ఏలూరు

జిల్లాలో ఇటీవల ఐసిడిఎస్ పరిధిలో చేసిన మార్పులు, చేర్పుల వల్ల వివిధ ప్రాజెక్టుల్లో అంగన్వాడీ వర్కర్లు రవాణా ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని వాటిని పరిష్కారం చేసేందుకు ఈ క్రింది విధంగా చర్యలు చేపట్టాలని ఎపి అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ (సిఐటియు) ఆధ్వర్యంలో ఐసిడిఎస్ పీడీ కె.పద్మావతికి వినతిపత్రం సమర్పించారు. మండవల్లి ప్రాజెక్టును పాత పద్ధతిలోనే కొనసాగించాలని, పోలవరం మండలాన్ని కొయ్యలగూడెం ప్రాజెక్టులో కలపాలని, జీలుగుమిల్లి మండలాన్ని బుట్టాయగూడెం ప్రాజెక్టులో కలపాలని వినతిలో కోరారు. ఈ కార్యక్రమంలో యూనియన్ జిల్లా గౌరవ అధ్యక్షులు కె.విజయలక్ష్మి, ఆయా ప్రాజెక్టుల నాయకులు కె.చెల్లాయమ్మ, సిహెచ్.వాణి, ఎం.రాణి, పి.విజయలక్ష్మి, కె.ప్రసన్న కుమారి ఉన్నారు.

ప్లాస్టిక్ నిషేధంపై ప్రత్యేక డ్రైవ్

ప్రజాశక్తి - ఏలూరు టౌన్

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ఆదేశాల ప్రకారం నగరపాలక సంస్థ పరిధిలో సింగిల్ యూజ్ ప్లాస్టిక్ వస్తువుల నిషేధంపై స్పెషల్ డ్రైవ్ నిర్వహించామని ఎంహెచ్‌ఒ డాక్టర్ మాలతి తెలిపారు. స్థానిక వన్‌టౌన్ పరిధిలోని ప్రధాన మార్కెట్లలో గురువారం ఎంహెచ్‌ఒ తనిఖీలు చేపట్టారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ సింగిల్ యూజ్డ్ ప్లాస్టిక్ వస్తువులు, కవర్స్ నిషేధించామన్నారు. జిల్లా కలెక్టర్, కమిషనర్ ఆదేశాల మేరకు ఫ్యాన్సీ, కిరాణా, పండ్లు, కూరగాయల దుకాణాల్లో తనిఖీలు నిర్వహించామన్నారు. ఈ తనిఖీల్లో 200 కేజీలు నిషేధిత ప్లాస్టిక్ సంచులు, వస్తువులు స్వాధీనం చేసుకుని, వ్యాపారులకు రూ.25 వేలు జరిమానా విధించామన్నారు. ఇకపై నిషేధిత ప్లాస్టిక్ కవర్లు వినియోగించే వ్యాపారులపై చర్యలు తీసుకుంటామని ఆమె హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో శానిటరీ ఇన్‌స్పెక్టర్ సుబ్బారావు, సచివాలయ, పారిశుధ్య విభాగం సిబ్బంది పాల్గొన్నారు.


27న ఎముకలు, కీళ్ల ఉచిత వైద్య శిబిరం

ప్రజాశక్తి - ఏలూరు

రమేష్ ఆసుపత్రి, లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో స్థానిక న్యూఅశోక్‌నగర్‌లోని కాకరాల కృష్ణమూర్తి, అన్నపూర్ణమ్మ లయన్స్ క్లబ్ కాంప్లెక్స్‌లో ఈ నెల 27న ఉచిత ఎముకలు, కీళ్ల వైద్యశిబిరం నిర్వహిస్తున్నట్లు రమేష్ హాస్పిటల్స్ సీనియర్ జనరల్ మేనేజర్ కోనేరు కోటేశ్వరరావు ఒక ప్రకటనలో తెలిపారు. ప్రముఖ వైద్య నిపుణులు, తిరుపతి బర్డ్స్ ఆసుపత్రి మాజీ సంచాలకులు డాక్టర్ గుడారు జగదీష్, వారి సహచర ఆర్థోపెడిక్ వైద్య నిపుణుల బృందంతో ఈ ఉచిత వైద్యశిబిరం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ముందస్తు అపాయింట్‌మెంట్ కోసం 7288811515, 8501898989 నంబర్లను సంప్రదించాలన్నారు.

మహిళలపై పెరిగిన దాడులు

అంతర్జాతీయ స్త్రీ హింస వ్యతిరేక దినోత్సవంలో ఐద్వా రాష్ట్ర కమిటీ సభ్యురాలు హైమావతి



మాట్లాడుతున్న హైమావతి

ప్రజాశక్తి - ఏలూరు

నేడు సమాజంలో మహిళలపై అన్నివైపుల నుంచి దాడులు పెరిగాయని, వారికి రక్షణ లేకుండా పోయిందని ఐద్వా రాష్ట్ర కమిటీ సభ్యురాలు హైమావతి అన్నారు. ఎస్ఎఫ్ఐ, ఐద్వా ఆధ్వర్యంలో అంతర్జాతీయ స్త్రీ హింస వ్యతిరేక దినోత్సవంలో భాగంగా గురువారం ఏలూరు కోటదిబ్బలోని జూనియర్ కాలేజీలో ప్రత్యేక కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో హైమావతి మాట్లాడుతూ నేడు స్త్రీలు అనేక సామాజిక, ఆర్థిక, రాజకీయ, విద్యాపరంగా అనేక సమస్యలు ఎదుర్కొంటున్నారన్నారు. గృహహింస, అత్యాచారాలు, లైంగిక వేధింపులు అధికమయ్యాయని ఆందోళన వ్యక్తం చేశారు. ఫలితంగా ఆత్మన్యూనతా భావానికి లోనై స్త్రీలు ఆత్మహత్యలకు పాల్పడుతున్నారని, వీటిని అరికట్టే ప్రయత్నంలో 1999 డిసెంబరు 17న ఐక్యరాజ్యసమితి తీర్మానం చేసిందన్నారు. ఈ మేరకు ప్రతీ సంవత్సరం నవంబరు 25న స్త్రీల హక్కుల పరిరక్షణ, స్త్రీ హింసా వ్యతిరేక దినోత్సవం నిర్వహిస్తున్నారన్నారు. ఆడపిల్లకు ఏమైనా ఇబ్బంది కలిగితే తమను సంప్రదించాలన్నారు. ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి గౌరీ శంకర్ మాట్లాడుతూ 1960లో డొమైన్ రిపబ్లిక్‌లో రాజకీయ నేతలైన మిరాబల్ సిస్టర్స్ హత్య ఆధారంగా స్త్రీ హింసా వ్యతిరేక దినం పాటిస్తున్నట్లు చెప్పారు. ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షులు కె.లెనిన్ మాట్లాడుతూ ఆడపిల్లకు నేడు రక్షణ లేకుండా పోయిందన్నారు. ఎస్ఎఫ్ఐ వారికి అండగా ఉంటుందని, మహిళలపై హింసకు పాల్పడితే సహించబోమని తెలిపారు. ఈ కార్యక్రమంలో కళాశాల అధ్యాపకులు రాజశేఖర్, విద్యార్థులు పాల్గొన్నారు

నేడు నూతన భవనంలోకి బ్యాంకు

ప్రజాశక్తి - ఉంగుటూరు

చైతన్య గోదావరి గ్రామీణ బ్యాంకును మండలంలోని గొల్లగూడెంలో నూతన భవనంలోకి ఈ నెల 25వ తేదీ శుక్రవారం మార్చనున్నారు. అదే గ్రామంలో ఓ ప్రయివేట్ భవనంలో బ్యాంకు కార్యకలాపాలు ఇప్పటివరకు నిర్వహిస్తున్నారు. కాగా బ్యాంకు సేవలు విస్తరణలో భాగంగా కొత్త భవనంలోకి తరలించి వినియోగదారులకు గ్రామ ప్రజలకు సేవలు అందించనున్నారు. ప్రారంభోత్సవానికి బ్యాంకు ఉన్నతాధికారులు, రైతులు హాజరు కానున్నారు.

సజ్జల రామకృష్ణారెడ్డిని కలిసిన తిరువీధుల శారద

ప్రజాశక్తి - ముదినేపల్లి

తాడేపల్లిలోని వైసిపి కేంద్ర కార్యాలయంలో రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన సలహాదారు సజ్జల రామకృష్ణారెడ్డిని మండలంలోని శ్రీహరిపురానికి చెందిన వైసిపి రాష్ట్ర నాయకులు తిరువీధుల శారద గురువారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా సజ్జల రామకృష్ణారెడ్డి మాట్లాడుతూ నియోజకవర్గంలోని ప్రజా సమస్యలపై ప్రత్యేక దృష్టి పెట్టాలని, నిరంతరం ప్రజలకు అందుబాటులో ఉంటూ నియోజకవర్గంలోని ప్రజలు ఏ సమస్యతో వచ్చినా వెంటనే పరిష్కరించాలని చెప్పినట్లు ఆమె తెలిపారు. అనంతరం శారద మాట్లాడుతూ కైకలూరు నియోజకవర్గంలోని నాలుగు మండలాల్లో పార్టీ కార్యాలయాలను త్వరలో ప్రారంభిస్తానన్నారు. ముదినేపల్లిలో తన కార్యాలయంలో నిరంతరం ప్రజలకు అందుబాటులో ఉంటున్నానని ఆయనకు వివరించాను. నియోజకవర్గంలోని ప్రతి కార్యకర్తకు అండగా ఉంటూ వారి సమస్యలను పరిష్కరిస్తానని చెప్పారు.



సజ్జలకు రామకృష్ణారెడ్డికి పుష్పగుచ్ఛం అందిస్తున్న తిరువీధుల శారద

హెచ్ఐవిపై అవగాహన

ప్రజాశక్తి - ముసునూరు

హెచ్ఐవి అనేది అంటువ్యాధి అని, ప్రాణాంతకం కాదని చైల్డ్ ఫండ్ ఇండియా లింక్ వర్కర్ స్కీం సూపర్‌వైజర్ సుందరరావు అన్నారు. మండలంలోని చెక్కపల్లి గ్రామ సచివాలయంలో రాష్ట్ర ఎయిడ్స్ నియంత్రణ, నివారణ సంస్థ వారి సహకారంతో హెచ్ఐవిపై గ్రామస్తులకు గురువారం అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో హెల్త్ అసిస్టెంట్ రిజ్వా, మేడం, ఆశా వర్కర్లు, గ్రామస్తులు పాల్గొన్నారు.

విద్యార్థులకు బహుమతులు అందజేత

ప్రజాశక్తి - జంగారెడ్డిగూడెం

జాతీయ గ్రంథాలయ 55వ వారోత్సవాల్లో భాగంగా నిర్వహించిన పోటీల్లో విజేతలకు బహుమతులు అందించామని స్థానిక శాఖ గ్రంథాలయ అధికారి పి.గంగాధర్ తెలిపారు. పోటీల్లో విజేతలైన ఆర్య వైశ్య కళాశాల విద్యార్థులకు గురువారం బహుమతులను అందించారు. ఈ కార్యక్రమంలో విశ్రాంత ఉపాధ్యాయులు ఎండి పుమర్ అలీ, ఎం.లక్ష్మి, దాస్, విజయనిర్మల పాల్గొన్నారు.

పిహెచ్‌సికి ఇన్వర్టర్ అందజేత

ప్రజాశక్తి - చింతలపూడి

రాఘవపురం ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి వేము గురవయ్య, మాటూరి అనిల్ గురువారం ఇన్వర్టర్ అందించారు. విద్యుత్ సరఫరాలో అంతరాయంలో ఇబ్బందులు లేకుండా ఈ ఇన్వెర్టర్‌ను అందించినట్లు వారు తెలిపారు. ఈ కార్యక్రమంలో పిహెచ్‌సి వైద్యాధికారి కె.కిరణ్, చైతన్య, జి.దొరసన్యమ్మ పాల్గొన్నారు.

లబ్ధిదారులు త్వరగా ఇళ్లు నిర్మించుకోవాలి

ప్రజాశక్తి - మండవల్లి

ప్రభుత్వం అందించిన స్థలాల్లో ఇళ్ల నిర్మాణం చేపట్టి త్వరితగతిన పూర్తి చేయాలని సర్పంచ్ మొండ సురేష్ తెలిపారు. స్థానిక సచివాలయంలో ఇళ్ల స్థలాల లబ్ధిదారులతో ఆమె గురువారం మాట్లాడారు. రాష్ట్రంలో పేదలకు ఇళ్లు నిర్మించి ఉండకూడదని లక్ష్యంతో మేనిఫెస్టోలో ప్రథమ అంశంగా పొందుపరిచి అధికారంలోకి రాగానే వేలాది ఎకరాలను కొనుగోలు చేసి లబ్ధిదారులను ఎంపిక చేసి నిరుపేదలకు పట్టాలను పంపిణీ చేశారన్నారు. ఆ స్థలాల్లో లబ్ధిదారులు ఇళ్లు నిర్మించుకునేందుకు పూర్తిస్థాయిలో మెరక చేసినట్లు చెప్పారు. ఇళ్ల నిర్మాణాలకు కావాల్సిన సౌకర్యాలను ఆయా శాఖల అధికారులతో మాట్లాడి పూర్తిస్థాయిలో ఏర్పాటు చేస్తున్నామని తెలిపారు. లబ్ధిదారులు వెంటనే ఈ అవకాశాన్ని అందిపుచ్చుకుని ఇళ్ల నిర్మాణ పనులు చేపట్టి త్వరగా పూర్తి చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో మొండ సురేష్ పాల్గొన్నారు.

జలజీవన్ మిషన్‌పై అవగాహన

ప్రజాశక్తి - జీలుగుమిల్లి

మండలంలోని ప్రతి గ్రామంలో 2024 నాటికి రక్షిత మంచి నీటిని కుళాయిల ద్వారా అందించడమే లక్ష్యంగా ప్రణాళికలు సిద్ధం చేయాలని ఆర్‌డబ్ల్యు డిఇ సత్యనారాయణ సూచించారు. స్థానిక ఎంపిడిఒ కార్యాలయంలో సచివాలయ, ఇంజినీరింగ్ అసిస్టెంట్లకు గురువారం నిర్వహించిన శిక్షణ శిబిరంలో ఆయన మాట్లాడారు. ప్రణాళికలను సిద్ధం చేయాలని సూచించారు. ఎంపిపి కోర్స పోసమ్మ ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. ప్రతిఇంటికీ కుళాయి కనెక్షన్ అందిస్తామని చెప్పారు. జలజీవన్ మిషన్ ఆవశ్యకతను సచివాలయ, ఇంజినీరింగ్ అసిస్టెంట్లకు వివరించారు. ఈ కార్యక్రమంలో ఎంపిడిఒ కె.మంగతాయారు, ఎఇలు వినయ్, వీరాస్వామి పాల్గొన్నారు.

నేరాలు - ఘోరాలు

చోరీ కేసులో నిందితుడు అరెస్టు

ప్రజాశక్తి - భీమడోలు

తాళాలు వేసి ఉన్న ఇళ్లు లక్ష్యంగా చోరీలకు పాల్పడుతున్న నిందితుడిని పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. భీమడోలు ఎస్ఐ చావా సురేష్ తెలిపిన వివరాల ప్రకారం... పూళ్ల గ్రామానికి చెందిన ఒక ఉపాధ్యాయుడు కుటుంబ సభ్యులతో కలిసి ఇంటికి తాళం వేసి వేరే గ్రామానికి వెళ్లారు. ఈ నెల 13వ తేదీన ఇంటికి తిరిగి వచ్చిన తరువాత ఇంటి తాళం తొలగించి ఉన్నట్లు గమనించారు. లోపలికి వెళ్లి పరిశీలించగా రూ.లక్ష విలువైన బంగారు, వెండి నగలు చోరీకి గురైనట్లు గుర్తించారు. దీంతో బాధితుడు భీమడోలు పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీనిపై పోలీస్ స్టేషన్ హెడ్ కానిస్టేబుల్ క్రైమ్ కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు. ఈ కేసులో నిందితుడిని పైబోయిన రమణను తణుకులో అదుపులోకి తీసుకుని సొత్తును స్వాధీనం చేసుకున్నారు. నిందితుడిని గురువారం భీమడోలు కోర్టులో హాజరు పర్చగా 15 రోజుల రిమాండ్ విధించారు. రమణ గతంలో పలు దొంగతనాల కేసుల్లో జైలుకు వెళ్లాడు. ఏలూరు, భీమడోలు, తాడేపల్లిగూడెం, తణుకు పోలీస్ స్టేషన్ల పరిధిలో అతనిపై పలు కేసులు నమోదైనట్లు తెలిపారు.

బైక్ అదుపుతప్పి వ్యక్తి మృత్యువాత

ముసునూరు : బైక్ అదుపుతప్పి వ్యక్తి మృతి చెందిన ఘటన మండలంలోని కొర్లకుంట శివారులో గురువారం ఉదయం చోటు చేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం... మండలంలోని చింతలపల్లి గ్రామానికి చెందిన పి.గౌరి (31) గురువారం ఉదయం బైక్‌పై వెళ్తుండగా కొర్లకుంట శివారు గొర్రెలమ్మ గుర్రాలయ్య ఆలయం వద్ద ఎన్‌ఎస్‌పి కాలువ మలుపులో బైక్ అదుపుతప్పి గాయాలపాలయ్యాడు. ఇది గమనించిన స్థానికులు అతనిని నూజివీడు ఏరియా ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా అక్కడ చికిత్స పొందుతూ పరిస్థితి విషమించి మృతి చెందాడు. ప్రయివేట్ కంపెనీలో పనిచేస్తున్న రాజేష్‌కు ఏడాది క్రితం వివాహమవ్వగా ఒక కుమారుడు ఉన్నాడు. సిబిఎం అంతిమ సంస్కారం కోసం పిల్లి మురళి బాధిత కుటుంబాన్ని పరామర్శించి, అండగా ఉంటామని చెప్పారు.

అనుమానాస్పదస్థితిలో వివాహిత మృతి

ప్రజాశక్తి - జంగారెడ్డిగూడెం

స్థానిక మెడియం లక్ష్మణరావు నగర్‌కు చెందిన వివాహిత అనుమానాస్పద స్థితిలో మృతి చెందింది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం... కామవరపు కోట మండల కేంద్రం పాతూరుకు చెందిన రమాదేవి (25)కి జంగారెడ్డిగూడెం మెడియం లక్ష్మణరావు నగర్‌కు చెందిన జంగం లక్ష్మీపతికి రెండేళ్ల క్రితం వివాహమైంది. ఇటీవల కుటుంబ కలహాల నేపథ్యంలో రమాదేవి భర్త లక్ష్మీపతి, అత్తమామలు వాదులాడుతూ ఉండేవారు. ఈ క్రమంలో గురువారం రమాదేవి మనస్తాపానికి గురై గదిలోకి వెళ్లి గడియ పెట్టుకుని సిస్పందించకుండా మృతి చెందిందని కుటుంబసభ్యులు తెలిపారు. సమాచారం తెలుసుకున్న స్థానిక ఎస్ఐ సాగర్ బాబు, సిఐ బాలసురేష్‌బాబు సంఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించారు. రమాదేవి మృతదేహాన్ని ఏరియా ఆసుపత్రికి తరలించారు. అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేశామని ఎస్ఐ సాగర్ బాబు తెలిపారు. మృతురాలు రమాదేవికి 11 నెలల పాప ఉంది.

ప్రజాశక్తి
పత్రిక పంపిణీలో ఇబ్బందులున్నవారు ఈ క్రింది నెంబర్లను సంప్రదించండి
ఏలూరు జిల్లా సర్క్యులేషన్ వివరాల కోసం సెల్: 94900 99190
పశ్చిమగోదావరి జిల్లా సర్క్యులేషన్ వివరాల కోసం సెల్: 83339 88814

వైకల్యాన్ని ఎదిరించి ప్రతిభకు పదును

గిరిజన కళాకృతుల్లో మారయ్య నైపుణ్యం

ఎంతోమందికి శిక్షణ ఇస్తున్న వైనం



మారయ్య



గిరిజన కళాకృతులు

ప్రజాశక్తి - బుట్టాయగూడెం

మండలంలోని అడవి ప్రాంతంలో లభించే వెదురు చెట్లతో గిరిజనులు వివిధ రకాల కళాకృతులను తయారు చేస్తున్నారు. నైపుణ్యం ఉన్న వస్తువుల తయారు చేయడంతో వాటికి మరింత ఆదరణ పెరిగింది. వికలాంగుడు అయిన మచ్చి మారయ్య అనే మాస్టారు తను నేర్చుకున్న ఈ కళాకృతుల విద్యను పలువురు గిరిజనులకు నేర్పించడమే కాకుండా తానే స్వయంగా వెదురు కర్రలతో కుర్చీలు, పెన్ బాక్సులు, డబుల్ కాట్ మంచాలు తదితర కళాకృతులను తయారు చేస్తున్నారు. గత నాలుగేళ్లుగా వైటిసిలో ఈ వస్తువులను తయారు చేస్తూ విక్రయిస్తూ ఉన్నారు. గత కరోనాకు ముందు అమెజాన్ వంటి సోషల్ నెట్‌వర్కింగ్ బిజినెస్‌లో కూడా ఈ వస్తువులకు అత్యంత ఆదరణ లభించింది. ఇటీవల కొన్ని అనివార్య కారణాల వల్ల తయారీ వెనక పడినప్పటికీ గత మూడు నెలలుగా తయారీ పుంజుకుంది. ప్రస్తుతం డబుల్ కాట్ మంచాలు, కుర్చీలు, సోఫా సెట్లు, గిఫ్ట్ ఐటమ్స్ వంటి వస్తువులను ఎంతో అందంగా ఆకర్షణీయంగా అందరినీ ఆకట్టుకునే విధంగా తయారు చేస్తున్నారు. తను నేర్చుకున్న విద్యను మారయ్య ఇటు కెఆర్ పురం, ఐటిడిఎలోనే కాకుండా ముంజులూరు, ముద్దుల్లపల్లి గ్రామాలతో పాటు వేలేరుపాడు, కుక్కునూరు మండలాల్లో కూడా ఎంతోమందికి ఈ వెదురు వస్తువుల తయారీ మీద శిక్షణ ఇచ్చారు. అక్కడ శిక్షణ పొందిన కళాకారులు పేరంటాలపల్లి ఏజెన్సీ ప్రాంతానికి వచ్చే పర్యాటకులకు విక్రయిస్తూ జీవనోపాధి పొందుతున్నారు.

ప్రభుత్వం సహకారం అందించాలి

మచ్చి మారయ్య

వికలాంగుడనైన నేను నిరుత్సాహంతో ఉన్న సమయంలో మా మాస్టారు నన్ను ప్రోత్సహించారు. ఆ సమయంలో వెదురుతో కళాకృతులను తయారీ నేర్చుకున్నాను. నైపుణ్యంగా వస్తువులు తయారు చేయడంతో నన్ను మాస్టర్‌గా ఏర్పాటు చేశారు. దీంతో వేలేరుపాడు, కుక్కునూరు, బుట్టాయగూడెం మండలాల్లోని అనేకమంది గిరిజనులకు వస్తువుల తయారీపై శిక్షణ ఇచ్చాను. వారు కూడా జీవనోపాధి పొందుతున్నారు. మరింత మందికి సహకారం అందించాలంటే మాకు ప్రభుత్వ సహకారం అందించాలి.

ఆక్రమణలు తొలగించాలని సిపిఎం వినతి



తహశీల్దార్‌కు వినతిపత్రం అందిస్తున్న సిపిఎం నాయకులు

ప్రజాశక్తి - నిడమర్రు


మండలంలోని భువనపల్లి ఏరియాలో సర్వే చేసి ఆక్రమణలు తొలగించాలని సిపిఎం మండల కన్వీనర్ నారపల్లి రమణరావు డిమాండ్ చేశారు. ఈ మేరకు తహశీల్దార్ సాయిరాజుకు గురువారం వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా రమణరావు మాట్లాడుతూ మురుగు డ్రెయిన్ కాలువను సర్వే చేయించి ఆక్రమణలు తొలగించాలని రైతులు మూడు నెలల నుంచి ఆందోళనలు చేస్తున్నా అధికారులు పట్టించుకోవడంలేదన్నారు. స్పందన కార్యక్రమంలో ఫిర్యాదు చేసినప్పటికీ సమస్య పరిష్కారం కావడంలేదన్నారు. సమస్యను పరిష్కరించకపోతే పోరాటం చేస్తామని హెచ్చరించారు. వారం రోజుల్లో సర్వే చేయించి సమస్యను పరిష్కరిస్తామని తహశీల్దార్ బి.సాయిరాజు హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో కోడూరు త్రిమూర్తులు, అలుమోలు సత్యనారాయణ, దూలం గౌరీశంకర్ పాల్గొన్నారు.

'రాజ్యాంగం అమల్లో ప్రభుత్వాలు విఫలం'

ప్రజాశక్తి - మండవల్లి

రాజ్యాంగాన్ని అమలు చేయడంలో ప్రభుత్వాలు విఫలమవ్వడంతో ప్రజల బతుకులు మారడం లేదని ప్రజాస్వామ్య పరిరక్షణ ఐక్యవేదిక సభ్యులు ఎల్ఎస్.భాస్కరరావు, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు జి.వెంకటేశ్వర్లు విమర్శించారు. రాజ్యాంగ దినోత్సవాన్ని పురస్కరించుకుని స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో గురువారం విద్యార్థులతో ప్రతిజ్ఞ చేయించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సమానత్వం కోసం శాసనంగా మార్చుకున్న రాజ్యాంగం నేటికీ 73వ వసంతంలోకి అడుగుపెట్టిందన్నారు. ప్రజలకు రాజ్యాంగం అందుబాటులో లేకపోవడం వల్ల, అందులో ఏం రాసి ఉందో తెలియకపోవడం వల్ల యజమానులుగా ఉండాల్సిన ప్రజలు సేవలకులుగా మారిపోయారన్నారు. ప్రశ్నిస్తేనే అభివృద్ధి సాధ్యమవుతుందని, రాజ్యాంగ ఫలాలు అందరికీ అందుతాయని వారు వివరించారు. ఇప్పటికైనా ప్రభుత్వాలు రాజ్యాంగాన్ని విద్యార్థులకు గ్రంథాలయాల్లో, ప్రభుత్వ కార్యాలయాల్లో సచివాలయాల్లో ప్రజలకు అందుబాటులో ఉంచేలా చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో ప్రజాస్వామ్య పరిరక్షణ ఐక్యవేదిక సభ్యులు టెంటు అప్పారావు, ఉపాధ్యాయులు నాగేశ్వరరావు, వెంకటేశ్వరరావు, కరుణకుమారి, పెరుమాళ్లవిద్యార్థులు పాల్గొన్నారు.

స్నేహితుడి కుటుంబానికి పూర్వవిద్యార్థుల సాయం



డిపాజిట్ పత్రాన్ని ఇస్తున్న పూర్వ విద్యార్థులు

ఉంగుటూరు :ఉంగుటూరు హైస్కూలులో 2002-2003లో పదో తరగతి చదువుకున్నవారిలో ఒకరైన చల్లా సత్యనారాయణ ఇటీవల గుండెపోటుతో మృతి చెందారు. ఆయన కుటుంబానికి పూర్వ విద్యార్థులు రూ.40 వేలు పోస్టాఫీస్‌లో గురువారం డిపాజిట్ చేశారు. సత్యనారాయణ కుమార్తె సాయి పేరున రూ.40 వేలు డిపాజిట్ చేసి తల్లి దుర్గకు డిపాజిట్ పత్రం అందించారు. ఈ కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు టేకి దుర్గా ప్రసాద్, లచ్చిరెడ్డి పవన్ కుమార్, మైనం సంజన, వానపల్లి సతీష్, చైన్ గలాష్, పురుషోత్తం పాల్గొన్నారు. తొలుత చల్ల సత్యనారాయణ చిత్రపటానికి పూర్వ విద్యార్థులు పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు.

ఎఎన్ఎం ప్రశాంతికి పరామర్శ, ఆర్థిక సాయం

ప్రజాశక్తి - కొయ్యలగూడెం

ఇటీవల రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడి ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న బోడిగూడెం సచివాలయ ఎఎన్ఎం దుర్గాప్రశాంతిని టిడిపి రాష్ట్ర మహిళ ఆర్గనైజింగ్ సెక్రటరీ గంగిరెడ్ల మేఘలాదేవి గురువారం పరామర్శించారు. దుర్గా ప్రశాంతికి వైద్య ఖర్చుల నిమిత్తం రూ.ఐదు వేల ఆర్థిక సాయం అందించారు. బాధితురాలి కుటుంబానికి టిడిపి అండగా ఉంటుందని ఆమె భరోసా ఇచ్చారు. సామాజిక సేవా కార్యక్రమాల్లో తన వంతు బాధ్యతగా మానవత్వాన్ని చాటుతున్న మేఘలాదేవి సేవలను పలువురు కొనియాడారు. ఈ కార్యక్రమంలో టిడిపి మహిళ నాయకులు చెరుకూరి రమ్య, కాకి లక్ష్మి, తులసి, నాగమణి, లక్ష్మి, దుర్గ పాల్గొన్నారు.

రోడ్డు, డ్రెయినేజీ సమస్య పరిష్కరించాలి

'గడపగడపకూ మన ప్రభుత్వం'లో ప్రజల విన్నపం



ప్రజలతో మాట్లాడుతున్న ఎంఎల్ఎ ఉన్నమట్ల ఎలిజా

ప్రజాశక్తి - జంగారెడ్డిగూడెం

డాంగే నగర్‌లో రోడ్డు, డ్రెయినేజీ సమస్యలు పరిష్కరించాలని ఆ ప్రాంత నివాసులు ఎంఎల్ఎ ఉన్నమట్ల ఎలిజాను కోరారు. స్థానిక 29వ వార్డులో గురువారం నిర్వహించిన గడపగడపకూ మన ప్రభుత్వం కార్యక్రమంలో ఎంఎల్ఎ ఉన్నమట్ల ఎలిజా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన ఇంటింటికి తిరిగి ప్రజా సమస్యలను అడిగి తెలుసుకున్నారు. రోడ్లు, డ్రెయినేజీ సమస్యలు పరిష్కరించాలని స్థానికులు కోరారు. రేషన్ కార్డుల మంజూరులో ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని ఎంఎల్ఎ దృష్టికి తీసుకెళ్లారు. ఈ సమస్యలపై స్పందించిన ఎంఎల్ఎ సంబంధిత శాఖ అధికారులతో మాట్లాడి సమస్య పరిష్కారానికి కృషి చేస్తానని తెలిపారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ బత్తిన నాగలక్ష్మి, వైస్ చైర్మన్లు కంచర్ల వాసవిరత్నం, ముప్పిడి వీరాంజనేయులు, మున్సిపల్ కమిషనర్ పి.భవానీప్రసాద్, రీజనల్ డైరెక్టర్ ఆఫ్ చైల్డ్ అండ్ ఉమెన్ వెల్ఫేర్ వందనపు సాయిబాల పద్మ, పట్టణ అధ్యక్షులు పిపిఎన్.చంద్రరావు పాల్గొన్నారు.

కుష్టుపై ఇంటింటా సర్వే

ప్రజాశక్తి - గణపవరం

మండలంలోని ముప్పర్తిపాడులో పిప్పర ప్రాథమిక ఆసుపత్రి ఆధ్వర్యంలో గురువారం కుష్టువ్యాధిపై ఇంటింటా సర్వే నిర్వహించారు. ఈ సందర్భంగా ఆరోగ్య కేంద్రం డాక్టర్లు కె.ప్రియాంక, దివ్య మాట్లాడుతూ ప్రభుత్వ ఆదేశాల ప్రకారం వచ్చే నెల ఐదో తేదీ వరకు ఇంటింటా సర్వే నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆరోగ్య సహాయకులు నామాల రాజు, ఎంఎల్‌హెచ్‌పి మేరిగ్రేస్, ఆశాలు కుమారి, పద్మావతి పాల్గొన్నారు.

వైసిపి పాలనలో అభివృద్ధి శూన్యం : టిడిపి

ప్రజాశక్తి - జంగారెడ్డిగూడెం

వైసిపి పాలనలో అభివృద్ధి శూన్యమని టిడిపి రాష్ట్ర కార్యదర్శి డాక్టర్ దాసరి శ్యామ్ చంద్ర శేషు విమర్శించారు. మండలంలోని ఎ.పోలవరంలో గురువారం నిర్వహించిన బాదుడేబాదుడు కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. పంచాయితీలను నిర్వీర్యం చేసి పంచాయతీల్లో ఉన్న డబ్బులను సైతం కాజేసిన ప్రభుత్వం వైసిపి అని విమర్శించారు.

టి.నరసాపురం : రాష్ట్రంలో పెరిగిన ధరలకు నిరసనగా టిడిపి మండల అధ్యక్షుడు నాయుడు రామకృష్ణారావు గౌడ్ ఆధ్వర్యంలో మండలంలోని జగ్గవరంలో గురువారం బాదుడే బాదుడు కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు.

బాధిత కుటుంబానికి టిడిపి సాయం

ప్రజాశక్తి - టి.నరసాపురం

మండలంలోని తిరుమలదేవిపేట గ్రామానికి చెందిన టిడిపి కార్యకర్త రాయలప్రసాద్ తల్లి రాయల వెంకటలక్ష్మి ఇటీవల మృతి చెందింది. ఈ నేపథ్యంలో బాధిత కుటుంబాన్ని టిడిపి మండల నాయకులు తోట లక్ష్మీనారాయణతో, పాటు పలువురు నాయకులు గురువారం పరామర్శించి రూ.ఐదు వేల ఆర్థిక సాయం అందించారు. ఆర్థిక సాయం అందించిన వారిలో టిడిపి నాయకులు వడ్డే శ్రీను, తోట వీరాస్వామినాయుడు, తోట పండు, అబ్బదసారి వెంకటేశ్వరావు, మధ్యాహ్నపు సురేష్, చిట్టిబొమ్మ వీరబాబు ఉన్నారు.

పలుచోట్ల అన్నదానం

గణపవరం : గణపవరం సువర్ణేశ్వర ఆలయం వద్ద గురువారం అన్న సమారాధన నిర్వహించారు. శ్రావణమాసం చివరి వారం సందర్భంగా ఆలయం వద్ద నిర్వహించిన అన్న సమారాధనలో స్థానిక డిగ్రీ కళాశాల విద్యార్థులు అందించిన సేవలు ఎనలేనివని కాలేజీ ప్రిన్సిపల్ పి.నిర్మలాకుమారి అన్నారు. విద్యార్థులు చదువుతో పాటు స్థానికంగా జరిగే కార్యక్రమాల్లో పాల్గొని సేవలందించడం హర్షణీయమని ఆలయ ఛైర్మన్ కూసంపూడి రామకృష్ణ రాజు, ఇఒ శ్రీధర్ అన్నారు.

ఏలూరు అర్బన్ : ఏలూరు పత్తేబాద సెంటర్‌లోని దేవాదాయ ధర్మాదాయ శాఖకు చెందిన శ్రీ చౌడేశ్వరి రామలింగేశ్వర దేవస్థానం ఆధ్వర్యంలో గురువారం ఆలయం వద్ద అన్నదాన మహోత్సవాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఏలూరు నగరంతో పాటు చుట్టుపక్కల ప్రాంతానికి చెందిన సుమారు పదివేల మంది పాల్గొన్నారని ఆలయ ఇఒ శంకర్రావు తెలిపారు. కార్తీక మహోత్సవం సందర్భంగా ఈ అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించినట్లు ఆయన పేర్కొన్నారు.

విద్యార్థులకు దంత వైద్య పరీక్షలు

ప్రజాశక్తి - జంగారెడ్డిగూడెం

స్థానిక ఏరియా ప్రభుత్వ ఆసుపత్రి హెచ్‌డిఎస్ ఆధ్వర్యంలో ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు దంత వైద్య పరీక్షలు నిర్వహించారు. రాష్ట్రీయ బాలల స్వాస్థ్య కార్యక్రమంలో భాగంగా స్థానిక ప్రభుత్వ ఏరియా ఆసుపత్రి అభివృద్ధి కమిటీ సొసైటీ ఆధ్వర్యంలో న్యూట్రిషన్ రిహేబిలేషన్ సెంటర్ పర్యవేక్షణలో 27వ వార్డు ఎంపిపి ప్రభుత్వ పాఠశాల, అంగనవాడీ కేంద్రం విద్యార్థులకు గురువారం వైద్య పరీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా ముఖ్య అతిథిగా హాజరైన మహిళా శిశుసంక్షేమ శాఖ రీజియన్ ఛైర్మన్ వందనపు సాయి బాల పద్మ మాట్లాడుతూ హాస్పిటల్ తరపున నిర్వహించిన హెల్త్ క్యాంపులను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. హాస్పిటల్ అభివృద్ధి సొసైటీ మెంబెర్ బావనరుషి మాట్లాడుతూ ఈ మెడికల్ హెల్త్ క్యాంపులు ప్రతి గురువారం అంగన్‌వాడీ కేంద్రాలు ఉన్నచోట నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో సొసైటీ త్రిసభ్య కమిటీ ఛైర్మన్ వందనపు వెంకటేశ్వరరావు, 28వ వార్డు కౌన్సిలర్, లావణ్య, వైద్యులు రామాంజనేయులు, హాసితా, మహిత, న్యూట్రిషనిస్ట్ గౌతమి, ఫిజియోథెరపిస్ట్ స్వప్న, స్కూల్ ఛైర్మన్ సైదం నాగరాజు పాల్గొన్నారు.

చేవూరులో పందుల స్వైరవిహారం



మంచినీటి చెరువు కలుషితం

పట్టించుకోని అధికారులు

ప్రజాశక్తి - ముదినేపల్లి

మండలంలోని చేవూరు ప్రజలు వరహాల చేష్టలతో తీవ్ర ఇక్కట్లు పడుతున్నారు. నిత్యం వరహాలు గుంపులుగుంపులుగా ఇళ్ల పెరట్లలోని ఆవ మొక్కలను పాడు చేస్తున్నాయని గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. రోడ్లపై గుంపులుగా తిరుగుతూ వాహనాలకు అడ్డంగా రావడంతో పలుసార్లు వాహనచోదకులు ప్రమాదాలకు గురవుతున్నారు. రాత్రి సమయాల్లో పందుల కారణంగా రోడ్డు ప్రమాదాలకు గురవుతున్నవారి సంఖ్య అధికంగా ఉన్నట్లు గ్రామస్తులు చెబుతున్నారు. గ్రామంలోని ఇద్దరు అన్నదమ్ములు వీటిని పెంచుతున్నట్లు చెబుతున్నారు. పెంపకందారులు వీటిని ఇష్టారాజ్యంగా వదిలి వేయడంతో గ్రామంలో అన్ని వీధుల్లో సంచరిస్తూ ప్రజలకు అనేక విధాలుగా నష్టం కలుగజేస్తున్నట్లు గ్రామస్తులు చెబుతున్నారు. ముఖ్యంగా రక్షిత మంచినీటి చెరువులో దిగడంతో మంచినీటి చెరువులోని నీరు కలుషితమవుతుందని వాపోతున్నారు. వీటి కారణంగా ప్రజలు పలు రోగాలు బారిన పడుతున్నట్లు గ్రామస్తులు చెబుతున్నారు. పందులను జాగ్రత్త చేసుకోవాలని పందుల పెంపకందారులకు పలుమార్లు విన్నవించినా పట్టించుకోవడంలేదంటూ గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ విషయమై పలుమార్లు గ్రామ సర్పంచి వల్లభనేని లక్ష్మి రెవెన్యూ అధికారులకు ఫిర్యాదులు చేసినా చర్యలు తీసుకోవడంలేదంటూ సర్పంచి ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి చేవూరులో ఉన్న వరహాలను పట్టించి అడవి ప్రాంతాలకు తరలించేందుకు చర్యలు తీసుకోవాలని గ్రామస్తులు కోరుతున్నారు.

నేడు లింగ వివక్ష వ్యతిరేక దినోత్సవం

ప్రజాశక్తి - ఏలూరు అర్బన్

ఈ నెల 25న వట్లూరులోని టిటిడిసిలో లింగ వివక్షత దినోత్సవం నిర్వహిస్తున్నట్లు డిఆర్‌డిఎ పీడీ విజయరాజు గురువారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ఈ కార్యక్రమానికి జిల్లా కలెక్టర్ ప్రసన్న వెంకటేష్‌తో పాటు అన్ని శాఖ జిల్లాల అధికారులు పాల్గొంటారని తెలిపారు.

పాస్‌పోర్టు పోయినది

ఏలూరు జిల్లా, గణపవరం మండలం, వల్లూరు గ్రామ కాపురస్తులయిన విపర్తి సుధారాణి, భర్త: రాజశేఖర్ అను నేను నాయొక్క పాస్‌పోర్టును వల్లూరు నుంచి గణపవరం వస్తూ ఉండగా మార్గమధ్యలో నా పాస్‌పోర్టు ఉన్న కవరు పడిపోయినది. నాయొక్క పాస్‌పోర్టు నెం. **S3803188.** కావున పాస్‌పోర్టు దొరికిన వారు ఈ క్రింది ఫోన్ నెంబరుకు తెలియజేయగలరు.

విపర్తి సుధారాణి
భర్త: రాజశేఖర్, వల్లూరు,
గణపవరం మండలం, ఏలూరు జిల్లా.
సెల్: 99499 34418

పాస్‌పోర్టు పోయినది

CHILAKAPATI RAMBABU అను నాకు విశాఖపట్నం పాస్‌పోర్టు కార్యాలయం అధికారులు ది.08-10-2012న **K8534661** నెంబరు గల పాస్‌పోర్టు మంజూరు చేసారు. సదరు పాస్‌పోర్టు జిరాక్సు కాపీలు తీయించుకునేందుకు మా ఇంటి నుండి నరసాపురం పట్టణం వెళ్తుండగా నా ఒరిజినల్ పాస్‌పోర్టు పోయినది. గాన నా పాస్‌పోర్టు ఎవరికైనా దొరికినచో ఈ క్రింది చిరునామాకు అందించగలరని కోరుతున్నాను.

CHILAKAPATI RAMBABU
S/o. Ch. Chintanna, 3-182,
Jala Durgamma Colony,
KP Palem North, Mogaltur Mandal,
W.G.Dist. A.P.

మహారాజశ్రీ ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి, ప॥గో॥జిల్లా, ఏలూరు
ఓ.ఎస్.నెం. 10/2019

బిట్వీన్:
వాది: మల్లిడి సునిల్ రెడ్డి
మరియు
ప్రతివాది:
అవ్వారు రమేష్, తండ్రి: (లేటు) నరసింహారావు, ఫ్లాట్ నెం.503, శ్రీనైనా టవర్స్, మోతేవారి తోట, అశోక్ నగర్, ఏలూరు, ప॥గో॥జిల్లా.

ఆర్డరు 5-రూల్ 20-సి.పి.సి. ప్రకారం దాఖలు చేసిన పేపరు ప్రకటన

పై నెంబరు దావాలో ప్రతివాదులకు సమన్లు ఎన్నిసార్లు పంపినను తీసుకొనక కాలయాపన చేయుచున్నందున సదరు దావా నోటీసు అమలు జరుగునందున **ది.01-12-2022వ తేదీకి కోర్టు వారు వాయిదా వేసినారు.** ఆరోజు ఉదయం గం॥ 10:30 ని॥లకు ప్రతివాది ప్రత్యక్షంగా గాని, ప్లీడరు ద్వారా గాని హాజరు కావలసిందిగాను, లేని ఎడల ప్రతివాది పరోక్షంలో దావా తీర్మానం కాబడునని తెలియజేయడమైనది.

బి.గౌరీశంకర్,
ఏలూరు, **ఎ.వి.ఎస్.సూర్యారావు,**
24-11-22. అడ్వకేట్స్, ఏలూరు.

మహారాజశ్రీ తణుకు సీనియర్ సివిల్ జడ్జి కోర్టు
H.M.O.P.No. 94/2022

బిట్వీన్:
తాటకుంట్ల నాగేశ్వరరావు **...పిటీషనరు**
AND
తాటకుంట్ల దుర్గా భవాని **...రెస్పాండెంటు**
W/o. నాగేశ్వరరావు, D/o. Indanama Sivayya, R/o. దువ్వ గ్రామం, తణుకు మండలం, ప॥గో॥జిల్లా-534156

యీ నెంబరు పిటీషనర్ రెస్పాండెంటు నుండి విడాకులు గ్రాంట్ చెయ్యవలసిందిగా దాఖలు చేసిన పై నెంబరు H.M.O.P.No. 94/2022 నందు రెస్పాండెంటు అయిన మీకు కోర్టు వారి ఉత్తర్వుల మేరకు కోర్టు ద్వారాను పోస్టు ద్వారాను మీకు ఎన్నిసార్లు నోటీసులు పంపిననూ అమలు జరగని కారణముగా Substitute of Service ద్వారా అమలు జరుగు నిమిత్తం కోర్టు వారు **ది. 30-12-2022నకు వాయిదా వేసియున్నారు.** ఆరోజు ఉదయం గం॥ 10:30 ని॥లకు పై కోర్టు వారి ఎదుట హాజరై మీ ఆక్షేపణలు తెలియపర్చుకోవలెను. లేని ఎడల మీ పరోక్షమందు తీర్మానించబడునని తెలియజేయడమైనది.

//By Order//
శామ్‌సన్ మెరిపో
పిటీషనర్ తరుపు న్యాయవాది
తణుకు. సెల్: 99499 90988

MUNICIPAL CORPORATION, ELURU
e-PROCUREMENT TENDER NOTICE No. 149/General/2022-23
Dated: 22-11-2022

The Commissioner, Municipal Corporation, Eluru, invites tenders from interested, eligible bidders for **"Construction of CC Drain at SMR Nagar in Municipal Corporation, Eluru"** Total No of work is 1 with an amount of **Rs. 26.56Lakhs.**

Tender schedules are available on e-procurement market place from 25-11-2022. Last date of receipt of tenders is 28-11-2022. Further details can be seen at e-procurement market place at **www.apeprocurement.gov.in** or contact Commissioner, Municipal Corporation, Eluru, Eluru District (Phone / Fax : 08812 - 245990)

Sd/- **COMMISSIONER,** Municipal Corporation, Eluru

నరసాపురం పురపాలక సంఘము

నరసాపురం పురపాలక సంఘము నందు మునిసిపల్ సాధారణ నిధులు మరియు గడప గడపకు మన ప్రభుత్వం (GGMP) నిధులతో వివిధ పనులు చేపట్టుటకు

ఇ-ప్రొక్యూరుమెంటు టెండరు నోటీసు

ఆర్.ఓ.సి.నెం. 300/2022-ఇ-1 మరియు ఇ-2 తేది.24-11-2022

1) బిడ్ అమ్మకం ప్రారంభ తేది మరియు సమయం : 25-11-2022 ఉ॥గం॥11:30లకు
2) బిడ్ దాఖలు ముగింపు తేది మరియు సమయం : 13-12-2022 సా॥గం॥4:00లకు
3) ప్రైస్ బిడ్ తెరచు తేది మరియు సమయం : 13-12-2022 సా॥గం॥4:30లకు

ఇ-ప్రొక్యూరుమెంటు షార్టు టెండరు నోటీసు

ఆర్.ఓ.సి.నెం. 393/2022-ఇ-1 మరియు ఇ-2 తేది.22-11-2022

1) బిడ్ అమ్మకం ప్రారంభ తేది మరియు సమయం : 25-11-2022 ఉ॥గం॥11:30లకు
2) బిడ్ దాఖలు ముగింపు తేది మరియు సమయం : 02-12-2022 సా॥గం॥4:00లకు
3) ప్రైస్ బిడ్ తెరచు తేది మరియు సమయం : 02-12-2022 సా॥గం॥4:30లకు

తదుపరి వివరాలకు www.eprocurement.gov.in లోని 'e' ప్రొక్యూర్‌మెంట్ మార్కెట్ ప్లేస్ నందు చూడవచ్చును.

నరసాపురం పురపాలక సంఘం సం/- కమిషనర్
నరసాపురం ఫోన్ నెం.08814273578 నరసాపురం పురపాలక సంఘం